# తరంగాలు

## రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

**94949 23460**



ఎడిటర్ : గద్దం నాగరాజు

RNI . TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

మంగళవారం

28 మే 2024

సంపుటి : 01

సంచిక : 360

పేజీలు : 8

వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa

Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna




# ధూమ్‌ధామ్‌గా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

- ట్యాంక్‌బండ్‌పై వినూత్నరీతిలో కార్నివాల్
- ఫుడ్‌కోర్టులు, లేజర్ షోలు..హస్తకళా ప్రదర్శనలు
- అధికారులకు ఆదేశాలు ఇచ్చిన సిఎస్ శాంతికుమారి

తరంగాలు-హైదరాబాద్,

తెలంగాణ దశాబ్ది అవతరణోత్సవాలను ధూమ్ ధామ్‌గా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు భారీగా ఏర్పాట్లు చేయబోతున్నారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. జూన్ 2న ఉదయం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధన అమరవీరులకు సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించనున్నారని, అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

-మిగతా 2 లో



# బెయిల్ వారం రోజులు పొడిగించండి

- సుప్రీంను అభ్యర్థించిన కేజ్రీవాల్

తరంగాలు-న్యూఢిల్లీ,

లోక్‌సభ ఎన్నికలనేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేజ్రీవాల్ తన మధ్యంతర బెయిల్‌ను 7 రోజులు పొడిగించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే అరవింద్ కేజ్రీవాల్ అనారోగ్యంతో బాధపడుతున్నారని అందుకే పొడిగించాలని చెప్పారు.

-మిగతా 2 లో



# మారనున్న రాష్ట్ర అధికారిక చిహ్నాం

- చిత్రకారుడు రుద్ర రాజేశంతో సీఎం రేవంత్ రెడ్డి చర్చ



తరంగాలు-హైదరాబాద్,

రాష్ట్ర అధికారిక చిహ్నాంపై చిత్రకారుడు రుద్ర రాజేశంతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా పలు నమూనాలను సీఎం రేవంత్ పరిశీలించారు. తుది నమూనాపై సీఎం పలు సూచనలు చేశారు. అధికారంలోకి రాగానే తెలంగాణ తల్లి విగ్రహం నమూనాను కూడా మార్చాలని సిఎం రేవంత్ నిర్ణయించారు. అలాగే రాష్ట్రగీతంగా అందెశ్రీ రాసిన జయజయహేకు పచ్చజెండా ఊపారు. అలాగే రాష్ట్ర చిహ్నాం కూడా తెలంగాణ కు అద్దంపట్టేలా ఉండాలని ఆకాక్షించారు. ఈ క్రమంలో దానిని మార్చాలని నిర్ణయించారు. అయితే రాష్ట్ర అధికారిక చిహ్నాంను మార్చొద్దని పలువురు రాజకీయ నాయకులు, మేధావులు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణ కోడ్ టీఎస్ స్థానంలో టీజీ తీసుకొచ్చారు.టీఎస్ స్థానంలో

-మిగతా 2 లో




# విచారణకు నటి హేమ డుమ్మా

- బెంగుళూరు డ్రగ్స్ కేస్‌లో మరో ట్విస్ట్
- జ్వరంతో విచారణకు రావడం లేదన్న నటి హేమ

హైదరాబాద్

బెంగుళూరు డ్రగ్స్ కేస్‌లో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. పోలీసుల విచారణకు నటి హేమ డుమ్మా కొట్టారు. విచారణ కు హాజరయ్యేందుకు సమయం కావాలని హేమ కోరినట్టుగా తెలుస్తోంది. తాను వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నానని బెంగుళూరు సీసీబీకి హేమ లేఖ రాసింది. హేమ లేఖను

-మిగతా 2 లో



# తెలంగాణపై తుఫాన్ ప్రభావం!!

-ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం
-పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ
-హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్,

తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని పలు జిల్లాలకుఎల్లో అలెర్ట్ జారీ చేసింది ఐఎండీ.. ఈరోజు సాయంత్రం హైదరాబాద్ తో పాటు పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావారణ శాఖ

-మిగతా 2 లో



# అగ్నిపథ్ స్కీమ్‌ను రద్దు చేస్తాం

- ఇండియా కూటమి అధికారంలోకి రాగానే అమల్లోకి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- రాహుల్ గాంధీ బహిరంగ సభలో కూలిన స్టేజీ
- తప్పిన ప్రమాదం.. ఊపిరిపీల్చుకున్న నేతలు

తరంగాలు-పాట్నా

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా పాట్నాలోని భక్తియార్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఇండియా కూటమి ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అగ్నిపథ్ స్కీమ్‌ను రద్దు చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. జూన్ 4న ఇండియా కూటమి సంకీర్ణ ప్రభుత్వం రాబోతోందని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అగ్నివీర్ పథకాన్ని అంతం చేస్తామని పేర్కొన్నారు. నన్ను దేవుడే పంపించాడంటూ ఇటీవల మోడీ చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. జూన్ 4 తర్వాత అవినీతి గురించి ఈడీ మోడీని అడిగితే,

-మిగతా 2 లో

# ఎపిలోనూ ఎన్‌డిఎ పాలన ఏర్పాటు



- వచ్చేది మళ్లీ మోడీ ప్రభుత్వమే
- ఎండాకాలం ఎన్నికలకు ఇక ముగింపు పలుకుతాం
- జమిలి ఎన్నికలతో వరుస ఎన్నికలకు స్వస్తి
- కేంద్రహోమంత్రి అమిత్ షా స్పష్టీకరణ

తరంగాలు-న్యూఢిల్లీ,

విభజన సందర్భంగా ఎపికి ఒనగూర్చే ప్రయోజనాల విషయంలో కేంద్రం ఓ రకంగా చేతులు ఎత్తేసిందనే చెప్పాలి. కానీ చాలానే చేశామని బిజెపి ప్రకటించుకుంది. పైగా విశాఖ ఉక్కును తెగనమ్మే ప్రయత్నం చేసింది. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి వైఫల్యాలు అనేకం. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నా ఒక్కటంటే ఒక్క మేలు చేయలేదు. అయినా ఎపిలో గణనీయంగా సీట్లు

-మిగతా 2 లో

# ధూమ్‌ధామ్‌గా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

(మొదటి తరువాయి)

సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ రవిగుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు దాన కిషోర్, శైలజా రామయ్యర్, శ్రీనివాస రాజు, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు తదితర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో జూన్ 2న ఉదయం రాష్ట్ర గీతాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించడంతో పాటు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. ట్యాంక్ బండ్‌పై సాయంత్రం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు రాష్ట్రంలోని అన్ని కళారూపాలతో పెద్దఎత్తున కార్నివాల్ నిర్వహించనున్నట్టు సీఎస్ వివరించారు. శిక్షణ పొందుతున్న 5000మంది పోలీస్ అధికారులు బ్యాండ్ ప్రదర్శన ఇవ్వనున్నారని చెప్పారు. ట్యాంక్ బండ్‌పై దాదాపు 80స్టాళ్లను ఏర్పాటు చేసి హస్త కళలు, చేనేత, స్వయం సహాయక బృందాలు తయారు చేసిన పలు వస్తువులతోపాటు నగరంలోని పేరొందిన హోటళ్లచే ఫుడ్‌స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పిల్లల కోసం పలు క్రీడలతో కూడిన వినోదశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం ఆకర్షణీయమైన బాణసంచా ప్రదర్శన, లేజర్ షో ఉంటుందన్నారు. ట్యాంక్ బండ్‌పై పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశమున్నందున వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సమీక్షలో సంబంధిత అధికారులను ఆదేశించారు.

# మారనున్న రాష్ట్ర అధికారిక చిహ్నం

(మొదటి తరువాయి)

టీజీ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, కార్పొరేషన్లు, వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు ఏదైనా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్‌ను టీఎస్ బదులుగా టీజీగా ఉపయోగిస్తున్నారు. లెటర్ హెడ్స్ రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్ సైట్లు, ఆన్‌లైన్ జీవోలు ఇతర అధికారిక వెబ్ సైట్లు ఆన్‌లైన్ జీవోల్లో టీజీగా మార్చారు. ఈ క్రమంలో త్వరలోనే అంటే జూన్ రెండు నాటికి రాష్ట్ర చిహ్నం అధికారికంగా ఖరారు అయ్యే అవకాశం ఉంది.

# బెయిల్ వారం రోజులు పొడిగించండి



(మొదటి తరువాయి)

తనను అరెస్ట్ చేసిన తర్వాత బరువు 7 కిలోలు తగ్గానని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు తీవ్రమైన వ్యాధి లక్షణాలు ఉన్నాయన్నారు. అందుకే తాను పీఈటీ–సీటీ స్కాన్ సహా పలు పరీక్షలు చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో టెస్టులు చేయించుకోవడానికి మరో 7 రోజులు గడువు కావాలని సుప్రీంకోర్టును కోరారు. అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మధ్యంతర బెయిల్‌పై బయట ఉన్నారు. సుప్రీంకోర్టు జూన్ 1 వరకు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 2న కేజ్రీవాల్ లొంగిపోవాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మాత్రమే అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌ను మార్చి 21న ఈడీ(ఇఆ) అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆయన జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలులో ఉన్నారు. దాదాపు 51 రోజుల తర్వాత అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు వచ్చారు. సుప్రీంకోర్టు అయనకు 21 రోజులు మాత్రమే రిలీఫ్ ఇచ్చింది. సుప్రీంకోర్టులో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ ప్రభుత్వం 2021–22కి సంబంధించిన లిక్కర్ పాలసీని రూపొందించి అమలు చేయడంలో అవినీతి, మనీలాండరింగ్ జరిగిందని ఈ కేసులో ఆరోపణలున్నాయి.

# విచారణకు నటి హేమ డుమ్మా

(మొదటి తరువాయి)

సీసీబీ పరిగణలోకి తీసుకుంది. హేమకు మరో నోటీస్ ఇచ్చేందుకు బెంగుళూరు పోలీసులు సిద్ధమయ్యారు.బెంగుళూరు రేవ్ పార్టీ కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతోంది. ఈ రేవ్ పార్టీలో డ్రగ్స్ తీసుకున్న 8 మందికి సీసీబీ నోటీసులు జారీ చేసింది. వారంతా బెంగళూరు సీసీబీ ఎదుట హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. నోటీసులు అందుకున్న వారిలో నటి హేమ కూడా ఉంది. ఈ రేవ్ పార్టీలో పాల్గొన్న తెలుగు వారందరికీ పాజిటివ్ అని తేలింది. వీరిలో నటి హేమతో పాటు ఆషీరాయ్, పార్టీ నిర్వహించిన వాసుతో పాటు పలువురు ఉన్నారు. అయితే హేమ మాత్రం తాను రేవ్ పార్టీలో లేనంటూ బుకాయించింది. హైదరాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్‌లో ఉన్నానంటూ వీడియో రిలీజ్ చేసింది. కట్ చేస్తే బెంగుళూరు పోలీసులు హేమ ఫోటోను రిలీజ్ చేశారు. అంతే సీన్ మాత్రం రివర్స్. హేమ ఈ పార్టీకి తన పేరుతో కాకుండా కృష్ణవేణి అనే పేరుతో హాజరైంది. పోలీసు రికార్డుల్లోనూ హేమ పేరు కృష్ణవేణిగా నమోదు చేయడం జరిగింది.

# ఎపిలోనూ ఎన్‌డిఎ పాలన ఏర్పాటు

(మొదటి తరువాయి)

గెల్చుకో బోతన్నట్లు కేంద్రహోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా వచ్చేది ఎన్డీయే సర్కారేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీలతో కలిసి భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని సంపూర్ణ ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో తాము దాదాపు 17 లోక్‌సభ స్థానాలను గెల్చుకుంటామనీ విశ్వాసం వ్యక్తం చేశారు. సార్వత్రిక సమరంలో దేశవ్యాప్తంగా 400కుపైగా సీట్లు సాధిస్తామన్నారు. దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సమయం వచ్చేసిందని షా అన్నారు. వాటితో ఎన్నికల వ్యయం దిగివస్తుందని పేర్కొన్నారు. మండే ఎండల్లో కాకుండా, మరేదైనా సమయంలో సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడంపై కూడా దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్‌లలోనూ ఈ దఫా కమలదళం ప్రభుత్వాలను ఏర్పాటుచేస్తుందని జోస్యం చెప్పారు. ఓ ప్రముఖ వార్తాసంస్థతో ఆయన పలు అంశాలపై మాట్లాడుతూ ఎపిలో ఎన్‌డిఎ అధికారంలోకి వస్తుతందని అన్నారు. ఈసారి అధికారంలోకి వచ్చాక.. ఐదేళ్ల కాలంలో విస్తృత సంప్రదింపుల అనంతరం దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని తాము అమలు చేయనున్నట్లు షా చెప్పారు. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే కాకుండా, విపక్ష పార్టీల పాలనలోని రాష్ట్రాల్లోనూ ఈ దఫా తమకు మెరుగైన ఫలితాలు వస్తాయని షా ధీమాగా పేర్కొన్నారు. 147 సీట్లున్న ఒడిశా అసెంబ్లీలో కమలదళం 75 స్థానాలు గెల్చుకుంటుందని అంచనా వేశారు. ఆ రాష్ట్రంలో 16–17 ఎంపీ సీట్లను తమ ఖాతాలో వేసుకుంటామని జోస్యం చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 17, పశ్చిమ బెంగాల్‌లో 24–32 లోక్‌సభ స్థానాలు ఎన్డీయేకు దక్కుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. యూసీసీని అమల్లోకి తీసుకురావాల్సిన బాధ్యతను రాజ్యాంగ నిర్మాతలు పార్లమెంటు, రాష్ట్రా శాసనసభల భుజస్కంధాలపై ఉంచారని షా పేర్కొన్నారు. రాజ్యాంగ పరిషత్ నిర్దేశిరచిన మూలసూత్రాల్లో యూసీసీ కూడా ఉందని చెప్పారు. తమ సర్కారు మూడోసారి అధికారంలోకి వచ్చాక.. అన్ని వర్గాలతో సంప్రదింపులు జరిపి వచ్చే ఐదేళ్లలో దాన్ని అమల్లోకి తీసుకొస్తుందని స్పష్టం చేశారు. సాయుధ బలగాల్లో నియామకం కోసం మోదీ సర్కారు తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకంపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తుండటాన్ని షా తప్పుబట్టారు. అగ్నిపథ్ కంటే ఆకర్షణీయ పథకం యువతకు ఇంకొకటి ఉండదన్నారు. నాలుగేళ్ల సర్వీసు అనంతరం పదవీవిరమణ పొందే అగ్నివీర్‌లకు రిజర్వేషన్ కారణంగా కేంద్ర సాయుధ పోలీసు దళాల్లో ఉద్యోగావకాశాలు 7.5 రెట్లు అధికంగా ఉంటాయని తెలిపారు. అగ్నిపథ్‌ను సరిగా అర్థం చేసుకోకుండా.. దాన్ని రద్దు చేస్తామని హామీ ఇస్తున్న రాహుల్‌గాంధీని చూస్తుంటే జాలేస్తోందన్నారు. ఏకీకృత వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానాన్ని తీసుకొస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇస్తోందని షా తెలిపారు. ధనవంతులు ఉపయోగించే విలాస వస్తువులపై, పేదలు వాడే సరకులపై ఒకే పన్ను రేటును అమల్లోకి తీసుకురావడం ఎలా సముచితమని ప్రశ్నించారు. సార్వత్రిక ఎన్నికల్లో తామేమీ మతం ఆధారిత ప్రచారం చేయడం లేదని షా స్పష్టం చేశారు. ఒకవేళ ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడటం, ఆర్టికల్–370 రద్దును చూపుతూ ఓట్లు అడగడం, యూసీసీని అమలు చేస్తామని చెప్పడం మతం ఆధారిత ప్రచార కార్యకలాపాలే అయితే.. భాజపా అలాంటి ప్రచారం చేసిందని, ఇకముందూ కొనసాగిస్తుందని స్పష్టంచేశారు. ఈవీఎంలు, పోల్ డేటాకు సంబంధించి ఈసీపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తుండటాన్ని షా తప్పుబట్టారు. భాజపా ఓడిపోయిన తెలంగాణ, కర్నాటక హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లోనూ ఇప్పుడు అనుసరించిన విధానాలనే ఈసీ అనుసరించిన సంగతిని గుర్తుచేశారు. ఓటమిని ముందుగానే గ్రహించి.. రాహుల్ వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకే పోలింగ్ విధానంపై కాంగ్రెస్ ప్రశ్నలు లేవనెత్తుతోందంటూ ఎద్దేవా చేశారు.

దేశంలో నక్సలిజం సమస్య అంతమవుతుందని షా ఉద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని ప్రాంతాల్లో తప్ప మరెక్కడా మావోయిస్టులు లేరని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఈసారి వేర్పాటువాదులు కూడా అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని షా అన్నారు. అక్కడ పోలింగ్ ప్రశాంతంగా ముగియడం మోదీ ప్రభుత్వం సాధించిన విధానపరమైన విజయమని పేర్కొన్నారు.


# అగ్నిపథ్ స్కీమ్‌ను రద్దు చేస్తాం

(మొదటి తరువాయి)

నాకేమీ తెలియదు.. నన్ను పంపింది దేవుడే అని చెబుతారా అని ప్రశ్నించారు. దేశంలోని యువతకు ఉపాధి కల్పించడంలో మోడీ విఫలమయ్యారని ఆరోపించారు. మోడీ జీ సుదీర్ఘ ప్రసంగాలు చేయడం మానేయండి.. దేశాన్ని విభజించడానికి ప్రయత్నించవద్దని రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలోని యువతకు ఎంత ఉపాధి కల్పించారో, ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ముందుగా బీహార్ యువతకు చెప్పాలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 2 కోట్ల ఉద్యోగాల గురించి మాట్లాడిన మీరు ఒక్క యువకుడికి కూడా ఉద్యోగం ఇవ్వలేదని చెప్పారు. మరోవైపు.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల ఖాతాల్లో ప్రతి నెలా రూ.8,500 జమ చేస్తామని, మహిళలకు ఆర్థిక సాయం అందించడం వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితిలో మార్పులు వస్తాయని రాహుల్ గాంధీ తెలిపారు. మరోవైపు.. ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ కూడా బీజేపీపై విరుచుకుపడ్డారు. కుటుంబ సభ్యులెవరూ మోడీ ప్రసంగాన్ని వినడానికి ఇష్టపడేంతగా ప్రధాని భాష స్థాయి పడిపోయిందని అన్నారు. కాగా.. ప్రస్తుతం దేశంలోని నేతలంతా చివరి దశ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. పాట్నాలోని పాలిగంజ్‌లో భారత కూటమి బహిరంగ సభ జరిగింది. రాహుల్ గాంధీ, తేజస్వి, ఇతర నేతలు కూడా ఈ సమావేశానికి చేరుకున్నారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్, ఇతర భారత కూటమి నాయకులు వేదికపైకి చేరుకున్నారు. వేదిక అకస్మాత్తుగా విరిగిపోయింది. అయితే.. అదృష్టవశాత్తు ఎవరూ గాయపడలేదు. స్టేజ్ కూలిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. వేదిక కూలే సమయంలో మిసా భారతి రాహుల్‌గాంధీ చేయి పట్టుకుని నిలబడ్డారు. కొంత సమయం తర్వాత భద్రతా సిబ్బంది రాహుల్ వద్దకు చేరుకోగా.. తాను క్షేమంగా ఉన్నానని చెప్పడం వీడియోలో కనిపించింది. మరికొందరు నేతలు వేదికపై తేజస్వి యాదవ్ ను పట్టుకున్నారు. అంతకుముందు పాట్నాలోని భక్తియార్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ప్రసంగించారు. భారతీయ జనతా పార్టీని టార్గెట్ చేస్తూ పలు ప్రశ్నలు సంధించారు. కాగా.. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా దేశంలో ఇప్పటి వరకు 6 దశల పోలింగ్ పూర్తయింది. ఆరో దశ ఓటింగ్ మే 25న ముగిసింది. ఏడో, చివరి దశ లోక్‌సభ పోలింగ్ జూన్ 1న ఉంది. ఈ దశలో 57 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఏడు రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్ లో కూడా ఇదే దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. చివరి దశ ఎన్నికల ప్రచారంలో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

# తెలంగాణపై తుఫాన్ ప్రభావం!!

(మొదటి తరువాయి)




వెల్లడించింది. రెమాల్ తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. వాయుగుండంగా మారి తీవ్ర తుఫాన్ గా మారింది.. నిన్న సాగర్ ఐలాండ్ వద్ద తుఫాన్ తీరం దాటింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి, మెదక్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, సూర్యాపేట్, నల్గొండ, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, భద్రాది కొత్తగూడెం జిల్లాలకు నేడు వర్ష కురిసే అవకాశం ఉంది. 40–50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. రేపు.. ఎల్లుండి రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఇదిలా ఉంటే.. ఆదివారం తెలంగాణలో రెమాల్ తుఫాన్ బీభత్సం సృష్టించింది. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో బలమైన గాలులు వీచాయి. దీంతో పలుచోట్ల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మద్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, నాగర్ కర్నూల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కలిపి నల్గొండ, సిద్దిపేట, వికారాబాద్ తదితర జిల్లాల్లో గాలివాన కురిసింది. వేర్వేరు ఘటనల్లో మొత్తం 14 మంది చనిపోయారు. దీంతో మృతుల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వర్షాలు, ఈదురుగాలులకు రాష్ట్రంలో 14 మంది మృతి చెందారు. నాగర్ కర్నూలు జిల్లాలో 8 మంది మృతి చెందగా.. శామీర్ పేటలో చెట్టు విరిగిపడి ఇద్దరు మృతి చెందారు. మియాపూర్ లో గొడ కూలి మూడేళ్ల బాలుడు, సిద్ధిపేట జిల్లా క్షీరసాగరలో ఇద్దరు మృతి చెందారు.

# మిర్జాపూర్ సహకార సంఘం అధ్యక్షులుగా రాంబాబు



తరంగాలు నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండలం మిర్జాపూర్ సహకార సంఘం కాంగ్రెస్ కోటలోకి చేరిపోయింది. గతంలో బీ ఆర్ ఎస్ పార్టీ చెందిన మారుతి చైర్మన్ కొనసాగుతుండగా ఆయన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దీనిత సోమవారం. మీర్జాపూర్ సహకార సంఘం అధ్యక్షుడు ఎన్నిక నిర్వహించారు. ఇందులో 12 మంది డైరెక్టర్ లు ఉండగా 10 మంది ఎన్నికలో పాల్గొన్నారు. ఎన్నికల్లో రాంబాబు ఛైర్మన్ పదవికి నామినేషన్ వెయ్యగా 11 గంటల వరకు ఎవరు నామినేషన్ వెయ్యగా పోవడంతో 10 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా రాంబాబును చైర్మన్ గా ఎన్నుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా బీర్కూర్, నసురుల్లాబాద్ మండల పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయి. రాంబాబు ఏకగ్రీవంగా చైర్మన్ గా ఎన్నుకోబడినట్లు సీఈవో జాకీర్ మన దినపత్రిక తో వెల్లడించారు . కాంగ్రెస్ ఖాతాలోకి మిర్జాపూర్ సహకార సంఘం చేరింది. మైలారం సహకార సంఘానికి ఎన్నికలు ఈ నెల 29న జరగవలసి ఉంది.

# గీత కార్పొరేషన్ చైర్మన్ ను వెంటనే నియమించాలి.

## -మోకుదెబ్బ రమేష్ గౌడ్ ...



**తరంగాలు ప్రతినిధి/నర్సంపేట**

నర్సంపేట మండలం లక్నెపల్లి గ్రామానికి చెందిన కత్తి విక్రమ్ గౌడ్ అనే గీత కార్మికుడు తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవషాత్తు కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ తెలంగాణా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ విక్రమ్ గౌడ్ ను సోమవారం పరామర్శించారు.. ఈ సందర్బంగా రమేష్ గౌడ్ ,రాజు గౌడ్ మాట్లాడుతూ కల్లు గీత కార్పొరేషన్ కు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చైర్మన్ తో పాటు పూర్తి కమిటీ నియమించాలన్నారు ఎక్సయిస్ శాఖ , బీసీ. కార్పొరేషన్ నుండి ఎక్స్ గ్రేషియా, హాస్పిటల్ ఖర్చుల కొరకు దరఖాస్తు చేయడం జరుగుతుందన్నారు. గత ఆరు నెలలుగా గాయపడిన, చనిపోయిన గీత కార్మికులకు పెండింగ్ ఎక్స్ గ్రేషియా, హాస్పిటల్ ఖర్చులు చెల్లించడం లేదన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్పొరేషన్ నుండి గత తెలుగు దేశం ప్రభుత్వంలో మాదిరిగా గీత కార్మికులకు రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా కల్లు గీత కార్పొరేషన్ కు 500 కోట్లు నిధులు కేటాయించాలని, పెండింగ్ ఎక్స్ గ్రేషియా వెంటనే మంజూరు చేయాలని రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు.పరామర్శించిన వారిలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకటేశ్వర్లు గౌడ్, లక్నెపల్లి గౌడ సంఘం అధ్యక్షులు మర్ద సురేష్ గౌడ్ , మోకుదెబ్బ మండల ఉపాధ్యక్షులు గోడిశాల అశోక్ గౌడ్ , కత్తి కిరణ్ గౌడ్, గుండెబోయిన కిరణ్ సాగర్ గౌడ్,గొట్టేపర్తి రమేష్ గౌడ్, మచ్చిక రాజు కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్సీ ఓటు హక్కు ను వినియోగించుకున్న ఎమ్మెల్యే కుంభం



**తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో సోమవారం వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటును వలిగొండ పట్టణ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కునువినియోగించుకున్న స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అనంతరం ఆయన మాట్లాడుతూ వరంగల్ ఖమ్మం నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట కూతురు కుంభం కీర్తి రెడ్డి, కుంభం విద్యాసాగర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి,పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య,సీనియర్ నాయకులు బత్తిని లింగయ్య,బత్తిని సహదేవ్,కాసుల వెంకన్న,పాలకూర వెంకటేశం,యువజన కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ కుమార్,బత్తిని అరుణ్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతురాలి భౌతిక దేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి నివాళి.....



**తరంగాలు ప్రతినిధి/రాయపర్తి:**

రాయపర్తి మండలం బురాన్ పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఇంతల కౌశమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వారి పార్థివా దేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు..






**తరంగాలు ప్రతినిధి/హన్మకొండ**

వరంగల్, నల్గొండ ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నిక సందర్భంగా హనుమకొండ వడ్డేపల్లి పింగిలి మహిళ కళాశాలలో సామాన్య వ్యక్తిలా వర్ధన్నపేట శాసనసభ్యులు ,విశ్రాంత ఐపిఎస్ అధికారి కేఆర్ నాగరాజు లైన్ లో నిలబడి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రులందరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

# బీరప్ప కామరాతి కళ్యాణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**తరంగాలు, ఆలేరు నియోజకవర్గం ప్రతినిధి :**

యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామరం మండల కేంద్రంలో బీరప్ప కామరాతి దేవి కళ్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు.ముందుగా ఆలయంలో మల్లన్న స్వామి, బీరప్ప స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆ తర్వాత ఆలయ నిర్వాహకులు కుల బంధువులు సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామి అమ్మవార్లను బీర్ల ఐలయ్య వేడుకున్నారు.

# ముదిగొండ రాములు అంతిమయాత్రలో పాల్గొన్న జిల్లా రజక నాయకులు

-బితెలంగాణ రజక రిజర్వేషన్ సమితి
-బిపార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించిన గోపి రజక



**తరంగాలు ప్రతినిధి/భువనగిరి నియోజకవర్గం**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎన్నో రజక ఉద్యమాలు చేసిన ఉద్యమ నాయకులుగా ప్రజాదరణను పొందిన ప్రజాగొంతుక ప్రజల పక్షాన పోరాటాలు చేసిన పోరాట యోధుడు సంఘాల్లో తనదైన శైలిలో పనిచేసిన తీరు ఎవ్వరికైనా కష్టం వచ్చినా నేనున్నాను అనే బరోసా కల్పించే బంధువుగాఆత్మీయుడిగా అప్పుడిగా ఉండే వ్యక్తి తిరిగిరాని లోకాలకు వెళ్తుంటే గుండెలు బరువెక్కి కన్నీటి పర్యంతమైన జనసంద్రంలో యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బస్వపూర్ గ్రామంలో నిశ్శబ్దపు చీకట్లు అలుముకున్న సోమవారం రోజున భువనగిరి జిల్లా జేఏసీ అధ్యక్షులు ముదిగొండ రాములుఅంతిమయాత్రలో పాల్గొన్న తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంపల్లి జంగయ్య,యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు జూపల్లి నగేష్,జిల్లా ఉపాధ్యక్షులు ముదిగొండ సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు పాండురాజుల ఉప్పలయ్య,జిల్లా యూత్ అధ్యక్షులు గొట్టికొప్పుల నవీన్,జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల అశోక్,జిల్లా కార్యదర్శి మామిడాల శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి బొల్లారం జహంగీర్,జనగాం జిల్లా సంయుక్త కార్యదర్శి ఉల్లెంగుల శేఖర్,జేఏసీ జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి, స్వామి,పి.నర్సింహ, ముదిగొండ వెంకటేష్, కిష్టయ్య, మహేష్ హాజరై వారి పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచినివాళు లర్పించారు.అదేవిధంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ భగవంతుడు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న చింతపండు నవీన్



**తరంగాలు, ఆలేరు నియోజకవర్గం ప్రతినిధి:**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిపఉపా లో కాంగ్రెసు పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న అతని భార్య మమతలక్ష్మీతో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్..



**తరంగాలు ప్రతినిధి:హన్మకొండ:**

వరంగల్,ఖమ్మం,నల్గొండ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో భాగంగా హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీజేపీ పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి, మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# స్వయంకృషి వృద్ధాశ్రమానికి 50కిలోల బియ్యం పంపిణీ...

-యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైస్ బ్యాగ్ చాలెంజ్ - 105 లో భాగంగా 50కిలోల బియ్యం అందజేత




**తరంగాలు ప్రతినిధి/వరంగల్**

యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాకు చెందిన చింతి రెడ్డి మహేందర్ రెడ్డి - రాధ దంపతుల కుమారుడు చింతి రెడ్డి సుమంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వీనస్ ఎంటర్ప్రైజెస్ వెంకటరమణ రెడ్డి సహకారంతో స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమం ములుగు రోడ్డు , హనుమకొండ లో ఉన్న వృద్ధులకు రైస్ బ్యాగ్ చాలెంజ్ - 105 లో భాగంగా 50కేజీల రైస్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్ , యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) , కానిస్టేబుల్ బొట్టు కమలాకర్ , కోలా రాజేష్ , ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ , అలువల పృథ్వి , ఉప్పరపల్లి రాజ్ కుమార్ , మునిగాల రాంప్రసాద్ , సృజన , జ్యోతి , భావన , బిటుకూరి యాకయ్య , పాలకుర్తి విష్ణు , ఎస్.కె ముస్తఫా , లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ ( హైకోర్ట్ అడ్వకేట్ ) , ఊరటి రవికుమార్ , యాద రవి కుమార్ , చెలిమల్ల అశోక్ కుమార్ , తూనం రాము , సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్ , మోడెం రాజశేఖర్ గౌడ్ , నాగవెల్లి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక తరంగాలు RNI. TELTEL/2022/83463 Tharangalu Daily News Paper

# పట్టభద్రుల ఓటు హక్కు వినియోగించుకున్న

## మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్





**తరంగాలు, ఆలేరు నియోజకవర్గ ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని జిపఉపా లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బూడిద బిక్షమయ్య గౌడ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్లు తప్పనిసరిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని అన్నారు. వీరి వెంట ఆత్మకూరు(ఎం)బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, మాజీ అధ్యక్షుడు కూరెళ్ళ తాజా మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య యాదవ్, జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, లగ్గాని రమేష్ గౌడ్,పల్లెపహాడు గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాలే మల్లేష్, మరియు బిజెపి రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం, మండల నాయకులు మజ్జిగ నరేష్, పరకాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్

–జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి వీపీ గౌతమ్



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం**

జిల్లాలో శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. ఎన్నికల్లో 67.63 శాతం పోలింగ్ జరగగా, ఇందులో 34847 మంది పురుషులు, 21881మంది మహిళలు, ఇద్దరు ట్రాన్సజెండర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 118 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసి, బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సుల ద్వారా ఓటింగ్ చేపట్టినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిసి కెమెరాల ఏర్పాటుచేసి, నూతన కలెక్టరేట్ లో కంట్రోల్ రూం ఏర్పాటుచేసి, లైవ్ వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని పర్యవేక్షణ చేసినట్లు అన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత జిల్లా ఎన్నికల అధికారి, రోటరీనగర్ జిల్లా పరిషత్ పాఠశాల, ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల తనిఖీ చేసి, పోలింగ్ అనంతరం ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సుల సీలింగ్, రిసిప్షన్ కేంద్రానికి తరలింపు ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల నుండి సీల్ చేయబడిన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల ఫారాలు పోలీస్ ఎస్కార్ట్ తో సెక్టార్ అధికారి పర్యవేక్షనతో ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసిప్షన్ కేంద్రానికి చేరుకున్నాయి. రిసిప్షన్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సామాగ్రిని, రిసిప్షన్ కేంద్ర సిబ్బంది సరిచూసుకొని, పోలీస్ ఎస్కార్ట్ తో భద్రత నడుమ తెలంగాణ ఆర్టీసీ డిజిటి బస్సులలో నల్గొండ లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంకు రవాణా చేయబడతాయని అన్నారు. జూన్ 5న నల్గొండ లో కౌంటింగ్ ప్రక్రియ చేపట్టబడుతుందని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, డిఎం సివిల్ సప్లయిస్ శ్రీలత, అధికారులు తదితరులు ఉన్నారు.

# పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకున్న

–మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భూక్య బాలు నాయక్



**తరంగాలు/మహబూబాబాద్**

వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టణ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మహబూబాబాద్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భూక్య బాలు నాయక్ మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీగా మంచి మెజార్టీతో గెలుస్తారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బాలు నాయక్ తెలిపారు. పట్టభద్రులందరూ తీన్మార్ మల్లన్న మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మంచి నాయకుని ఎన్నుకొని సమాజాభివృద్ధి కృషి చేయాలని తద్వారా సమాజం మనగల మరియు పురోగతిని సాధిస్తుందని వారు పేర్కొన్నారు.

# నకిలి పత్తి విత్తనాల నిందితుల అరెస్ట్



**తరంగాలు మిర్యాలగూడ ప్రతినిధి**

మిర్యాలగూడ నకిలీ పత్తి విత్తనాలు నిందితులను అరెస్ట్ చేసినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు అన్నారు. సోమవారం స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో

వివరాలు వెల్లడించారు. ఈ నెల 25వ తేదీన ఈదులగూడ చౌరస్తా వద్ద 260 క్వింటాళ్ల పత్తి గింజలు పట్టుబడినట్లు తెలిపారు. ఈ కేసులో నలుగురిని అరెస్ట్ చేయగా....ఒకరూ పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సీఐ సుధాకర్, ఎస్ఐ రవి ఉన్నారు.

# నోట్ల ఆశచూపించి ఓట్లను దండుకోవాలనుకున్న పార్టీలకు నిరాశేనా?

**తరంగాలు ప్రతినిధి/ఆలేరు నియోజకవర్గం:**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బిఆర్ఎస్ బిజెపి కాంగ్రెసు పార్టీలు బరితెగించి ఓటర్లకు డబ్బుల ఆశచూపించి ఓట్లను దండుకోవాలనుకున్నవీ బిఆర్ఎస్ ఓటుకు 500, బిజెపి కాంగ్రెసు పార్టీలు ఓటుకు 200 నుండి 500 వరకు పంపిణీ చేశారని నోటు రాని ఓటర్లలో గుసగుసలుగా విన్పిస్తున్నాయి. యాదగిరిగుట్ట ఆలేరు మండలాల్లో 500,రాజపేట, బొమ్మలరామరం, తుర్కపల్లి, మొటకొండూర్, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాల్లో ఓటర్లకు నోట్ల పంపిణీ చేశారని ప్రచారం జరుగుతోంది.ఓటర్ల పేరుతో నాయకులే ఎక్కువగా లబ్ధి పొందవచ్చు అనుకుంటున్న ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

# వలిగొండ మండల కేంద్రంలో ఓటింగ్ సరళిని పర్యవేక్షించిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు



**తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో సోమవారం జరిగే వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భాగంగా వలిగొండ మండల కేంద్రంలో పోలింగ్ సరళిని పర్యవేక్షించిన జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి రాష్ట్ర సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి పర్యవేక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు భాగంగా బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాకేష్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలుపు ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మల వెంకటరెడ్డి పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ అప్రోజ్, ఎంపీటీసీ పల్సం రమేష్,మాజీ జెడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్,మహిళా నాయకురాలు మద్దెల మంజుల ,జిల్లా నాయకులు కొమిరెల్లి సంజీవరెడ్డి ,కొండూరు వెంకటేశం, ఐటిపాములసత్యనారాయణ, ఎడవెల్లి శాంతి కుమార్, మారయ్య మోటే సాంబ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటుహక్కును వినియోగించుకున్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**తరంగాలు, ఆలేరు నియోజకవర్గం ప్రతినిధి:** నల్గొండ, వరంగల్, ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ లో భాగంగా సోమవారం రోజు యాదగిరిగుట్టలో ఓటు హక్కును వినియోగించుకున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య.

# తీన్మార్ మల్లన్నకి శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

–"అనంతరం పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించిన బీర్ల ఐలయ్య"



**తరంగాలు, ఆలేరు నియోజకవర్గం ప్రతినిధి:** వరంగల్,ఖమ్మం,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తుర్కపల్లి మండల కేంద్రంలో ఓటు వేసి యాదగిరిగుట్ట పోలింగ్ కేంద్రం వద్ద ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మర్యాదపూర్వక కలసిన ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న. ఈ సందర్భంగా బీర్ల మాట్లాడుతూ ఎమ్మెల్సీగా మంచి మెజార్టీతో గెలుస్తున్నారని బీర్ల ఐలయ్య తీన్మార్ మల్లన్నకు తెలిపారు. పట్టభద్రులందరూ తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం బీర్ల ఐలయ్య అలేరు రాజపేట పోలింగ్ స్టేషన్స్ ను సందర్శించారు పోలింగ్ సరళిపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# మృతదేహానికి నివాళులు అర్పించిన కల్లూరి రామచంద్రారెడ్డి



**తరంగాలు, ఆలేరు నియోజకవర్గ ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా బోమలరామారం మండల కేంద్రానికి చెందిన ఆగ్రోస్ ఫర్టిలైజర్స్ అధినేత నాగిరెడ్డి రామ్ రెడ్డి ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన సందర్భంగా సోమవారం రోజు వారి మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రాంచంద్రా రెడ్డి మరియు నాయకులు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వేములకొండ 2003-2004 సంవత్సరం ఎస్ ఎస్ సి విద్యార్థిని విద్యార్థులు 20 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకొని వారి యొక్క బాల్య దశలో మధురమైన జ్ఞాపకాలను చిలిపి మాటలను గుర్తుకు చేసుకుంటూ ప్రస్తుతం ఒకరిని ఒకరు ఏ ఉద్యోగ రీతిలో పనిచేస్తున్నారని ఒకరినొకరు అనుకుంటూ అందరం ఒకే కట్టు మీద ఉంటూ మన యొక్క సాధకబాధకాలను పాలుపంచుకుంటూ చూసుకుంటూ మనం ఎల్లప్పుడూ ఒకే రీతిలో ఉండాలని గుర్తు చేసుకున్నారు.అలాగే మనకు విద్య బోధన నేర్పించిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించడం జరిగింది.

# 1కోటి 23లక్షల గంజాయి పట్టివేత

**-492 కేజీల గంజాయిని పట్టుకున్న కొత్తగూడెం 3 టౌన్ పోలీసులు**

తరంగాలు /భద్రాద్రి ప్రతినిధి /
సినీ ఫక్కీలో నిషేధిత గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు ఈ రోజు కొత్తగూడెం 3టౌన్ ఎస్సై పురుషోత్తం తన సిబ్బందితో కలిసి ఓల్డ్ డిపో రోడ్డు వద్ద వెహికల్ చెకింగ్ చేయుచుండగా సుమారుగా మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వ్యాన్ 5732 లో క్యాబిన్ వెనుక భాగానికి సమాంతరంగా అనుమానం కలుగకుండా ప్రత్యేకంగా మరొక అరను తయారుచేసి అందులో ప్రభుత్వ నిషేధిత గంజాయి ప్యాకెట్లను అమర్చి రవాణా చేస్తుండగా వారిని పట్టుకోవడం జరిగింది.వ్యానులో నిషేధిత గంజాయిని గుర్తించిన అనంతరం బయటకు తీసి తూకం వేయగా 492 కేజీలు ఉన్నట్లు తేలింది.దీని విలువ సుమారుగా రూ.1,23,00,000/-(ఒక కోటీ ఇరవై మూడు లక్షలు) ఉంటుంది.జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులతో



కలిసి 3టౌన్ పోలీసులు ఇట్టి గంజాయిని పట్టుకోవడం జరిగిందని 3టౌన్ సిఐ శివప్రసాద్ వివరాలను వెల్లడించారు. 1).శుభమ్ శరత్ బండారీ, శరత్ లక్ష్మణ్ బండారి,27 ,ఆటో డ్రైవర్, . . 25,సంస్కృతి కాలనీ,ఫర్సుంగి,పూణే, మహారాష్ట్ర మరియు 2).అంజత్ అబ్దుల్ షేక్,%S/o .అబ్దుల్ మల్సూర్ షేక్, 36 ,లారీ డ్రైవర్, .ఆలంగర్ ఏరియా,నాగర్ మండల్,అహ్మద్ నగర్ జిల్లా, మహారాష్ట్ర అను ఇద్దరు వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం,సీలేరు వద్ద పెద్దగొండి గ్రామానికి చెందిన రాజు అను వ్యక్తి వద్ద ఇట్టి గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్ర,షోలాపూర్ కు చెందిన యోగేష్ అనే వ్యక్తి వద్దకు తీసుకెళ్తుండగా ఈరోజు కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు పట్టుకోవడం జరిగింది.పట్టుబడిన ఇద్దరు నిందితులకి సోలాపూర్ కి చెందిన యోగేష్ డబ్బులు ఇచ్చి గంజాయిని తీసుకుని రమ్మని చెప్పగా,వీరిరువురు ఇట్టి గంజాయిని వ్యానులో తరలిస్తున్నట్లుగా విచారణలో తేలింది.నిషేధిత గంజాయిని విక్రయించిన రాజు మరియు కొనుగోలు చేయడానికి ప్రయత్నించిన యోగేష్ మరియు రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ తెలిపారు.పట్టుబడిన ఇద్దరు నిందితులను రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించడం జరిగిందని తెలియజేశారు. నిషేధిత గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న నిందితులను చాకచక్యంగా పట్టుకున్న త్రీ టౌన్ మరియు టాస్క్ ఫోర్స్ పోలీసు అధికారులు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## ఓటింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు...



తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట
వర్ధన్నపేట మండల పరిధిలో పోలింగ్ సరళి గురించి ఉమ్మడి వరంగల్-నల్గొండ- ఖమ్మం పట్టభద్రుల ఉపఎన్నిక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో కలిసి మండల ,గ్రామ స్థాయి నాయకులను పోలింగ్ సరళి గురించి వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట డిసిసిబి బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్రావు, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ ,టౌన్ అధ్యక్షుడు మైస సురేష్, జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్,వర్ధన్నపేట టౌన్, మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పురుగుమందులు,వికృత ఆహారపు అలవాట్లే అనేక వ్యాధులకు ప్రధాన కారణం

**-డాక్టర్ కె వై.రాంచందర్**



తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :
నేటి మానవులే కాకుండా సమస్త జీవరాసికి పురుగు మందుల అవశేషాలు గల ఆహారముతో పాటు , ఆధునిక ఆహరపు అలవాట్లే అనేక వ్యాధులకు కారణం అని వాటికి లోను కాకుండా చక్కని జీవన శైలి అలవర్చుకుంటే సమయం, వృధా ఖర్చులు ఆదాఅగును అని,ప్రతి వ్యక్తి ప్రతిరోజూ తమ శరీరాన్ని శ్రమింప జేసీ, తగిన నీరు తీసుకొని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆర్గ నైజింగ్ సెక్రటరీ రాకం శ్యామ్ బాబు అధ్యక్షతన గ్రంధాలయం భవనం లో ఈరోజు ఉదయం జరిగిన ప్రకృతి ఆరోగ్య అవగాహనా కార్యక్రమం లో నెలకొండపల్లి లోని సిద్దార్ధ యోగ విద్యాలయ వైద్యులు డాక్టర్ కె వై.రాంచందర్ పిలుపునిచ్చారు.కార్యక్రమం లో వాకర్స్ కమిటీ నిర్వాహకులు కే.వెంకట్, పిల్లి సుదర్శన్,, వి. జ్యోతి,మచ్చ లక్ష్మి, మాధవి,తాల్లూరి వేణు, విజయ్ కుమార్, వెంకట్ బాబు, నాగన్న రాకం శ్యాంబాబు పాల్గొని తొడ్పాటు అందించారు.

## ఎమ్మెల్సీఎన్నికల్లో కష్టపడిన బీ.ఆర్.ఎస్ కుటుంబ సభ్యులకు పేరు పేరున కృతజ్ఞతలు

తరంగాలు /సంగెం



పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాలతో,జిల్లా నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర రావు సూచనలతో వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భాగంగా బి.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపు కోసం అహర్నిశలు కృషిచేసిన జడ్పిటిసి, మండల పార్టీ కమిటీ సభ్యులకు, సమన్వయ కమిటీ సభ్యులకు,వైస్ ఎంపీపీకి,మాజీ సర్పంచ్లకు,ఎంపీటీసీలకు,సొసైటీ చైర్మన్లకు గ్రామ పార్టీ కమిటీ సభ్యులకు, సీనియర్ నాయకులకు, క్లస్టర్ ఇంఛార్జులకు, యువతకు పేరు పేరున హృదయపూర్వక కృతజ్ఞతులు ధన్యవాదములు తెలుపుకుంటున్నాను. మీ పసునూరి సారంగపాణి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంగెం మండలం.

## ఓటు హక్కు వినియోగించుకున్న పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు



తరంగాలు ప్రతినిధి/వరంగల్
వరంగల్ - నల్గొండ - ఖమ్మం నియోజకవర్గ పట్టభద్రుల ఎం.ఎల్.సి ఉప ఎన్నికల్లో భాగంగా బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వరంగల్ - ఖమ్మం - నల్గొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎం.ఎల్.సి ఉప ఎన్నికల నేపథ్యంలో ను జెడ్.పి.ఎస్.ఎస్ ( బాయ్స్ ) హై స్కూల్ నర్సంపేట లో బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. యువత మేలుకో ప్రజలకు సేవ చేసే సరైన నాయకుని ఎన్నుకోవాలని కోరారు. పట్టభద్రులు అందరూ విధిగా తమ ఓటు హక్కును వినియోంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

**-డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ..**

తరంగాలు ప్రతినిధి/హనుమకొండ
వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్ల లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కొరకై అహర్నిశలు శ్రమించిన పార్టీ కార్యకర్తలకు, నాయకులకు పేరు పేరు నా కృతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆత్మకూరు మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న చేసిన సేవలు ఎంతోమంది విద్యార్థి, విద్యార్థినిలకు చదువుపరంగా కావచ్చు, వైద్యపరంగా అనునిత్యం శ్రమించి వారికి మంచి భవిష్యత్ అందించిన మన తీన్మార్ మల్లన్న గత ప్రభుత్వం ఎన్నో కేసులు పెట్టి ఎన్నో ఇబ్బందులు పెట్టిన అధరకుండా



,బెదరకుండా ప్రజల పక్షాన ప్రజల గొంతై ప్రజల కొరకు పరితపించే వ్యక్తిగా తన పోరాటాన్ని కొనసాగించాడు. ఇలాంటి వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ గుర్తించి పట్టబదుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం చాలా ఆనందంగా ఉందన్నారు. తీన్మార్ మల్లన్న కొరకై ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంతన్న, ప్రభుత్వ సలహాదరు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో నా వంతుగా నేను ప్రచారాలు చేస్తూ నా వెంబడి ఉన్న కార్యకర్తలు ,నాయకులు నాపై నమ్మకంతో మల్లన్న మీద ఉన్న అపారమైన ప్రేమతో ప్రచారంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. తీన్మార్ మల్లన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్లో గెలుపొంది మరెన్నో సేవలు రాష్ట్రానికి చేస్తారని తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమని రామకృష్ణ చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మండలధ్యక్షులు రమేష్, సర్పంచ్ రాజు, జడ్పీటీసీ రాజు , వాసు, శామ్యూల్, అయోధ్య జయపాల్, మహేందర్, కాజా సాంబియ్య, రాజు ,తదితరులు పాల్గొన్నారు.

# శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక ప్రక్రియ సజావుగా పూర్తి

**-జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా.**

తరంగాలు /భద్రాద్రి ప్రతినిధి /
వరంగల్- ఖమ్మం- నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికకు సంబంధించి శ్రీ రామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసినటువంటి రిసెప్షన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల పరిశీలించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ పెట్టెలను పటిష్టమైన బందోబస్తు తో రిసెప్షన్ సెంటర్ కు తరలించడం జరిగింది. రిసెప్షన్ సెంటర్ కు తరలించిన బ్యాలెట్ పెట్టెలను, పిఓ డైరీలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 55 పోలింగ్ కేంద్రాల్లో శాసనమండలి పట్టబద్రులు ఉప ఎన్నిక నిర్వహించడం



జరిగిందని, 28077 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని,దీనిలోపురుషులు16206 మరియు మహిళలు11871 మంది ఉన్నారని తెలిపారు. జిల్లాలో 70.01% పోలింగ్ నమోదు అయ్యిందని తెలిపారు. ఉప ఎన్నిక పోలింగ్ క్రియా ప్రశాంతంగా ముగియటం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నిక నిర్వహించడం ఎంతో అభినందనీయమని, ఎన్నిక నిర్వహణలో భాగస్వాములైన అధికారులకు, అనధికారులకు, జిల్లా ప్రజలకు, పాత్రికేయులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్,కొత్తగూడెం ఆర్డీవో మధు, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, తాసిల్దార్ పుల్లయ్య, ఇల్లందు తాసిల్దార్ రవికుమార్, కొత్తగూడెం డిప్యూటీ తాసిల్దార్ అంజాద్ పాషా, ఎలక్షన్ సూపర్డెంట్ ధారా ప్రసాద్, ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ రంగప్రసాద్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ

**-జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల.**



తరంగాలు /భద్రాద్రి ప్రతినిధి /
వరంగల్- ఖమ్మం- నల్గొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక సందర్భంగా టేకులపల్లి గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను(251,252) జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పోలింగ్ కేంద్రంలో ఏర్పాటుచేసిన సౌకర్యాలను పరిశీలించి, అక్కడ ఉన్న ఓటర్లను కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సరళిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత శాతం పోలింగ్ నమోదు అయింది, ఇంకా ఎంత శాతం నమోదు కావాల్సి ఉన్నది అన్న వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కి భోజనం మరియు ఇతర సౌకర్యాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పోలింగ్ విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ పెట్టల రవాణాకు పట్టిష్టమైన భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట టేకులపల్లి తాసిల్దార్ మరియుసంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటింగ్ సరళిని పర్యవేక్షించిన భాజపా నాయకులు

**-భాజపా రాష్ట్ర సీనియర్ నాయకుడు గూడూరు నారాయణరెడ్డి.**

తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో సోమవారం వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటింగ్ సరళినీ పర్యవేక్షించిన రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి వలిగొండ పట్టణ కేంద్రానికి వచ్చి ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు భాజపా బలపరిచిన అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలుపు కోసం కార్యకర్తలు తమ వంతు బాధ్యతగా మొదటి ప్రాయంత ఓటు వేసి విధముగా పట్టభద్రులను అభ్యర్థించాలని నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ లింగస్వామి మండల పార్టీ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చు శ్రీనివాస్ యువ మోర్చా భువనగిరి అసెంబ్లీ కన్వీనర్ బుంగమట్ల మహేష్, మారోజు అనిల్, నాగరాజు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయం

**–ఓటు హక్కును వినియోగించుకున్న కౌన్సిలర్ పడిగెల రేణుక ప్రదీప్**



**తరంగాలు ప్రతినిధి/ఆలేరు నియోజకవర్గం:** వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా భువనగిరి పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల బూత్ లో ఓటు హక్కును వినియోగించుకున్న 23వ వార్డు కౌన్సిలర్ పడిగెల రేణుక ప్రదీప్. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకి మొదటి ప్రాధాన్యత ద్వారా ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మేధావులు విద్యార్థులు ఉద్యోగస్తులు ప్రవేట్ ఉపాధ్యాయులు నిర్ణయించుకున్నారని అన్నారు. తీన్మార్ మల్లన్న గత టీఆర్ఎస్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేసి కెసిఆర్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టిన నేతగా పేరుపొందిన నాయకుడు తీన్మార్ మల్లన్న విద్యార్థులు గాని ఉపాధ్యాయుల గాని ప్రవేట్ ఉద్యోగస్తుల గాని ఎటువంటి సమస్యలు వచ్చినా ప్రశ్నించే గొంతుగా నిలబడతారని విద్యార్థులకు సకాలంలో స్కాలర్ షిప్స్ గాని ప్రవేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయుల సమస్యలు గానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే నాయకుడు తీన్మార్ మల్లన్న. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే దిశగా తీన్మార్ మల్లన్న పని చేస్తాడని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున గ్రాడ్యుయేట్స్ సమస్యలు తొందరగా పరిష్కారమైన దిశగా కృషి చేస్తాడు అని అన్నారు.

# విత్తన ఎరువులు మరియు పురుగుమందుల డీలర్లు అందరికీ అవగాహన కార్యక్రమం..








**–డివిజన్ సహాయ సంచాలకులు రమేష్ బాబు**

**నాగర్ కర్నూల్ , తరంగాలు**

నాగర్ కర్నూల్ మండలంలోని విత్తన ఎరువులు మరియు పురుగుమందుల డీలర్లు అందరికీ నాగర్ కర్నూల్ డివిజన్ సహాయ సంచాలకులు రమేష్ బాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి పి నర్మదా నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా పత్తి విత్తనాలు అమ్మకాల్లో పాటించవలసిన గమనికలు అదే విధంగా, ఎలాంటి నకిలీ విత్తనాలు అమ్మకాలు చేయకుండా సూచనలు ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా విత్తన డీలర్లు అందరూ కూడా రైతులకు విత్తనాలు అమ్మినప్పుడు వారికి రసీదును విత్తనాల యొక్క వివరాల ప్రకారం ఇవ్వాల్సిందిగా అదేవిధంగా నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్నటువంటి ధరలకు మాత్రమే అమ్మాల్సిందిగా తెలియజేస్తూ విత్తనాల అమ్మకాల యొక్క పూర్తి వివరాలను ప్రతిరోజు సేల్స్ రిజిస్టర్ లో మెయింటైన్ చేయాల్సిందిగా తెలియజేయడమైనది. అమ్మకాల్లో అవకతవకలు ఏమైనా చేసినట్లయితే నకిలీ విత్తనాల అమ్మకాలు, అదేవిధంగా ఎక్కువ రేట్లకు విత్తనాలను నమ్మినట్లయితే కచ్చితంగా శాఖా పరమైన కఠినమైన చర్యలు తీసుకోబడతాయని

హెచ్చరించడం జరిగింది. అదేవిధంగా రైతులకు కూడా తెలియజేయునది విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు వ్యవసాయ శాఖ నుండి లైసెన్స్ పొందినటువంటి డీలర్ దగ్గర నుంచి మాత్రమే విత్తనాలు కొనాల్సిందిగా, కచ్చితంగా రసీదును పొందాల్సిందిగా అదేవిధంగా, వారి పంట కాలం ముగిసే వరకు విత్తనాలకు సంబంధించిన పత్రాలను అదేవిధంగా ఖాళీ సంచులను కూడా భద్రపరచుకోవాల్సిందిగా తెలియజేయడమైనది.

# తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నూతన కమిటీ.





**హైదరాబాద్ తరంగాలు**

తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షుడు.కార్మిక నాయకులు మాజీ బోర్డు కమిటీ నెంబర్ అనంతయ్య మాట్లాడుతూ. కార్మిక శాఖలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని కార్మికులకు చాలా ఇబ్బందికరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. డెలివరీ మరియు మ్యారేజ్ గిఫ్ట్ లు. డెత్ కేసులకు. యాక్సిడెంట్ కేసులకు, సంబంధించి వెల్ఫేర్ బోర్డులో ఆన్లైన్ సిస్టం తీసుకొచ్చి కార్మికులను చాలా ఇబ్బందుల గురి చేస్తున్నారని అన్నారు. వేలిముద్ర రాని చో కార్మికుడు మీసేవ చుట్టూ తిరుగుతూ చాలా ఇబ్బందుల గురవుతున్నారని అన్నారు. నూతన ప్రధాన కార్యదర్శి. యూనియన్ నాయకులు సత్యనారాయణ మాట్లాడుతూ. డెలివరీ గిఫ్ట్ కు చిన్నపిల్లల తీసుకొని మీసేవ చుట్టూ తిరుగుతున్నారని డెలివరీ కేసులకు ఆన్లైన్ సిస్టం తీసివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు మాట్లాడుతూ ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకున్న బోర్డులో అప్లోడ్ అని చూపించిన తర్వాత ఆన్లైన్లో దరఖాస్తు కానరాకపోవడం అసలు అప్లికేషన్ ఎక్కడికి వెళ్లిందని చెప్పలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారని అన్నారు. కార్మికుల పట్ల ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని నాయకులు మండిపడ్డారు ఇలాంటి సమస్యలను పరిష్కారం కోసం ఈ నూతన కమిటీ ముందుండి ప్రజా సమస్యల మీద పోరాటం చేస్తుందని నాయకులు అన్నారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షులు పరమేశ్వర్..అధ్యక్షులు బ్యాగరి అనంతయ్య. ఉపాధ్యక్షులు. నల్ల నర్సింగ్ రావు. ప్రధాన కార్యదర్శి. పల్లపు సత్యనారాయణ. సహాయ కార్యదర్శి .పగడాల దేవయ్య. సహాయ కార్యదర్శి.జాజుల బిక్షపతి.కోశాధికారి ఎర్ర అనిత.ఆర్గనైజర్ కార్యదర్శి పంగ కిషన్. కమిటీ సభ్యులు .రా మెల్ల మల్లేష్. కొక్కిలిగడ్డ. కృపాకర్ రావు. కొక్కిలిగడ్డ నాగేందర్. వేష ఓన ఈరయ్య. సల్లంగుల శ్రీశైలం. జాంపాలా మన్యం. గొల్లూరి శ్యామ్ దాస్. కృపాకర్. తాటికాయల అశోక్ కుమార్. ఆకునూరి నర్సింగ్. కైరా బాబు. తదితరులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# ఓటు హక్కు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**తరంగాలు ప్రతినిధి/హన్మకొండ**

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టబద్రుల ఉప ఎన్నికల్లో భాగంగా కాకతీయ యూనివర్సిటీ విశ్వవిద్యాలయ న్యాయ కళాశాల భవనంలో పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పోలింగ్ బూత్ లో తన ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య.



తొర్రురు హైస్కూల్ లో పట్టభద్రుల ఉపఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి...

# జిహెచ్ఎంసి సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. రామ్ కీ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలి

**– ఏఐటియుసి మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్**








**హైదరాబాద్ తరంగాలు**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం దగ్గర ఈరోజు intuc, aituc ,Tjas , కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈరోజు సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర నాయకులు ఆదిల్ షరీఫ్ అధ్యక్షత నిర్వహించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీను, ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర రెడ్డి, మున్సిపల్ రంగం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలో బస్తి లలో పిన్ పాయింట్లు దగ్గర చెత్త లారీలను ఇప్పటికే రామ్ కి రాంకి సంస్థ కు అప్పజెప్పడం జరిగింది. జిహెచ్ఎంసి అధికారులు ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో అధికారులు అతి ఉత్సాహంతో రాంకి సంస్థ కు కోట్ల రూపాయల కాంట్రాక్టు అప్పజెప్పడం జరిగింది. చెత్త సేకరించే లారీల మీద విధులు నిర్వహించే డ్రైవర్లని కార్మికులని ఇప్పటికే 814 మందిని పార్కులలో చెరువులలో విధులు నిర్వహించాలని కార్మికులను పంపడం జరిగింది. మరో 168 చెత్త సేకరణ చేసే లారీలు ఉన్నాయి చెత్త సేకరణ చేసే వేకిళ్ళ మీద మరో 1200 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాంకీ సంస్థ కు ఇచ్చినటువంటి కాంట్రాక్టు రద్దు చేయాలని యధావిధిగా జిహెచ్ఎంసి సంస్థ నుండే చెత్త సేకరణ చెయ్యాలన్నారు. జిహెచ్ఎంసి సంస్థలో అన్ని విభాగంలో పనిచేసే కార్మికులని ఈ యొక్క ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని పర్మినెంట్ చేసేంతవరకు కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఈ యొక్క ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఎన్నికల కోడ్ తర్వాత కార్మికులతో జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ ముందు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మున్సిపల్ రంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు చర్లపల్లి రాములు, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు నల్లమోతు సిద్దార్థ



**తరంగాలు/మిర్యాలగూడ ప్రతినిధి**

మిర్యాలగూడలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు, ఎన్.బి.ఆర్ ఫౌండేషన్ అధినేత నలమోతు సిద్ధార్థ ఈరోజు తమ పట్టభద్రల ఓటు హక్కును వినియోగించుకున్నారు పోలింగ్ బూత్ కి వెళ్లి ఓటు వేసి వచ్చారు

# కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కలిగిఉండాలి





– జిల్లా అదనపు ఎస్పీ వినోద్ కుమార్

**జగిత్యాల ప్రతినిధి, తరంగాలు**

వచ్చే జులై నుంచి అమల్లోకి రానున్న కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ వినోద్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కొత్త చట్టాలపై అవగాహన , శిక్షణ కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ కొత్తగా రూపొందించిన మూడు చట్టాలు – భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత , భారతీయ సాక్ష్యా అధినియమన్నారు. 2023లో చేసిన ఈ మూడు చట్టాలు రానున్న జూలై 1, 2024 నుండి అమలులోకి రానున్నాయని తెలిపారు. అందులో భాగంగా వీటి గురించి జిల్లాలోని పోలీసు అధికారులకు , సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మూడు కొత్త క్రిమినల్ చట్టాలలో సమకాలీన కాలం, వాడుకలో ఉన్న సాంకేతికతలకు అనుగుణంగా అనేక కొత్త నిబంధనలు చేర్చడం జరిగిందని, బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్ధవంతంగా నిర్వహించడానికి అనుగుణంగా కొత్త క్రిమినల్ చట్టాలకు చాలా రూపొందించడం జరిగిందన్నారు. క్రిమినల్ చట్టాల సూక్ష్మ నైపుణ్యాలను కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సమాజానికి వాటి ఆచరణాత్మక ఉపయోగం , చుట్టూ జరుగుతున్న నేరాల గురించి అదనపు ఎస్పీ వినోద్ కుమార్ క్లుప్తంగా వివరించారు. కొత్త చట్టాల వర్తింపు, నేరాలు దానికి సంబంధించిన కేసులతో వ్యవహరిస్తున్నప్పుడు వాటిని ఎలా గ్రహించాలనే దానిపై పోలీసు శాఖకు చెందిన డిఎస్పీ నుండి కానిస్టేబుల్ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వినోద్ కుమార్ తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన పట్టభద్రుల పోలింగ్



**నూతనకల్– తరంగాలు**

నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టబద్రుల ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతమైన వాతావరణంలో ముగిసింది సోమవారం నూతనకల్ మండలంలో పట్టభద్రుల పోలింగ్ సరలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు పరిశీలించి మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి కట్ట మల్లారెడ్డి బొడ్డుపల్లి అంజయ్య దరిపెల్లి వీరన్న గణేష్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యుత్ మోటార్ల వైర్ల చోరీ



**తరంగాలు ప్రతినిధి/ఆలేరు నియోజకవర్గం:**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపూరం గ్రామంలో వ్యవసాయ బోరు బావుల మోటార్ల వైర్లను దొంగలు దొంగిలించినారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. తాజా మాజీ సర్పంచ్ కోమిరెల్లి రాంరెడ్డి మరియు కోమిరెల్లి ప్రతాప్ రెడ్డి ల బోరుబావుల మోటార్ల వైర్లను దొంగలు దొంగిలించినారని అన్నారు.పోలీసులు రాత్రి పూట ముమ్మరంగా గస్తీ తీరుగుతున్నను దొంగతనాలు జరుతున్నందున రైతులు ఆందోళన చెందుతున్నారు.

## నర్సింహులపేటలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్ 74% నమోదు

**తరంగాలు /నర్సింహులపేట,**

వరంగల్–నల్గొండ– ఖమ్మం ఎమ్మెల్సీ పట్టభద్రుల ఉపఎన్నిక పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. సోమవారం మండల కేంద్రంలో పట్టభద్రులంతా కేంద్రాల వద్ద బారులు తీరి మరీ వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 165 పోలింగ్ బూత్ లో 613 ఓట్లకు గాను 460 పోలైన ఓట్లు పోలుకాగా, 166 పోలింగ్ బూత్ లో 562 ఓట్లకు గాను 416 పోలైన ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మొత్తం మండల వ్యాప్తంగా 1177 ఓట్ల గాను 870 పట్టభద్రులు ఓటు వినియోగించుకోగా 74% నమోదు అయినట్లు పోలింగ్ అధికారులు తెలిపారు.

## ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్న కౌన్సిలర్ కొదమగుండ్ల సరిత, సిపిఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్



**నేరేడుచర్ల తరంగాలు**

నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో భాగంగా నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకున్న నేరేడుచర్ల మున్సిపల్ 8వ వార్డు సిపిఎం కౌన్సిలర్ కొదమగుండ్ల సరిత నేరేడుచర్ల సిపిఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్లనగేష్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకై ఈ దేశ లౌకిక తత్వాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుటకై ప్రతి ఒక్క పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు అన్నారు. ప్రశ్నించే అభ్యర్థి ప్రజా గొంతుకులకు ఓట్లు వేసినట్లయితే, చట్టసభలో నిరుద్యోగుల సమస్యలపై, విద్యారంగ పరిరక్షణకై ప్రజాస్వామ్య పరిరక్షణకై, ప్రజా సమస్యల పరిష్కారం కొరకై పోరాడుతారని, డబ్బు, మద్యం ప్రలోభాలకు లోను కాకుండా ఓటర్లు తమ పక్షాన నిలబడి పట్టభద్రుల హక్కుల కొరకై ప్రజలహక్కుల కొరకై పోరాడే వ్యక్తి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని లౌకికతత్వాన్ని కాపాడాలని వారు కోరారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్

–ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్



**వలిగొండ తరంగాలు**

వలిగొండ మండల కేంద్రంలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ హై స్కూల్ లో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఉప ఎన్నికలలో మొత్తం 52 మంది పోటీల్లో ఉండగా కాంగ్రెస్ తరపున తీన్మార్ మల్లన్న బిఆర్ఎస్ పార్టీ నుండి ఏనుగుల రాకేష్ రెడ్డి బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ప్రధానంగా బరిలో నిలిచారు మండల పరిధిలో 3561 ఓట్లు ఉండగా 2768 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు ప్రాధాన్యత ఓటు పద్ధతి అయినందున ఈవీఎంలను వినియోగించే అవకాశం లేకపోవడంతో బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరిగింది ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఇచ్చిన వైలెట్ రంగు పెన్నుతో ప్రాధాన్యతను టిక్కు చేశారు ఇటీవల లోక్ సభ ఎన్నికలలో ఎడమచేతి చూపుడు.వేలుకు సిరా చుక్క పెట్టినందువల్ల ఈ ఎన్నికలలో ఎడమ చేతి మధ్య వేలుకు సిరావేశారు. ఉప ఎన్నిక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామన్నపేట సిఐ ఎన్ వెంకటేశ్వర్లు వలిగొండ స్థానిక ఎస్సై డి మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు మద్యం దుకాణాలు మూసివేసి పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు సాయంత్రం 4.గం. లకు వరుసలో నిలబడిన వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు దాదాపు 6.30 గంటలకు పట్టభద్రుల ఎన్నికలు ముగిశాయి ఎన్నికల్లో వలిగొండ తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి మరియు రెవెన్యూ సిబ్బంది ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు గ్రామపంచాయతీ సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు తమ విధులను నిర్వహించారు పోలింగ్ కేంద్రంలో ఓట్ల సరళిని ఆయా పార్టీల నేతలు పర్యవేక్షించడానికి వచ్చారు.

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల



**తరంగాలు**

వలిగొండ పట్టణ కేంద్రంలో జరిగిన వరంగల్ ,ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా సోమవారం మాజీ మంత్రి గుంతకల్లు జగదీశ్వర్ రెడ్డి, భువనగిరి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం, జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. వలిగొండ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మండలం లోని ప్రతి పట్టభద్రుల ఓటు కలిగిన వారిని కలిసి బిఆర్ఎస్ అభ్యర్థికి, ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మొగుళ్ల శ్రీనివాస్ గౌడ్, ఎంపిటిసి పల్సం రమేష్ గౌడ్, పడమటి మమత మండల మహిళా విభాగం అధ్యక్షురాలు మద్దెల మంజుల, పట్టణ అధ్యక్షులు మొహమ్మద్ అప్రోజ్, మండల సీనియర్ నాయకులు ఐటిపాముల సత్యనారాయణ, కొండూరు వెంకటేశం గౌడ్, గూడూరు శేఖర్ రెడ్డి, సంధ్య, కల్లెం మారయ్య, ఎడవల్లి శాంతి కుమార్, పల్సం రాజు, కాసుల మధుసూదన్ గౌడ్, పబ్బు స్వామి గౌడ్, బల్గూరి నరేష్ రెడ్డి, పబ్బు వెంకట్ రమణ, పోలేపాక బిక్షపతి, పోలేపాక సత్యనారాయణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు




**తరంగాలు –గోవిందరావుపేట**

వరంగల్ ఖమ్మం నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం మండల కేంద్రంలో ప్రశాంతంగా ముగిసినట్లు తహసిల్దార్ సృజన్ కుమార్ తెలిపారు. ఎన్నికలు ముగిసిన వెంటనే సృజన్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ 199వ పోలింగ్ కేంద్రంలో 738 మంది ఓటర్లకు గాను 506 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వీరిలో పురుషులు 298 మహిళలు 208 మంది ఉన్నారని అన్నారు. 200 పోలింగ్ స్టేషన్లో 518 మంది ఓటర్లు ఉండగా 394 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వీరిలో పురుషులు 280 మంది కాగా మహిళలు 114 మంది ఉన్నారని అన్నారు. మొత్తం మీద మండలంలో 71.65% పోలింగ్ నమోదయిందని తెలిపారు. పోలింగ్ నిర్వహణలో ఆర్ ఐ లు రాజేందర్ సుధాకర్ మరియు సిబ్బంది శ్రమించి పనిచేశారని అన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి సహకరించిన పోలీసులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి పోలింగ్ విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు సదుపాయాల పరంగా ఎలాంటి లోటు లేకుండా చూసుకోవడం జరిగిందని అన్నారు. తాసిల్దార్ సృజన్ కుమార్ అందించిన కృషి బాగుందని ఎన్నికల సిబ్బంది అన్నారు.

MOVIES TIME

మంగళవారం 28, మే, 2024

తరంగాలు
Tharangalu Daily News Paper

# అద్భుతమైన అవకాశం తలుపు తడితే.. సింపుల్‌గా నో చెప్పిన శ్రీలీల..?



గ్లామర్ వరల్డ్ లో అంత మందిని దాటుకుని ఓ అవకాశం తలుపు తట్టడం అంటే మామూలు విషయం కాదు. అలా వచ్చిన అవకాశాలను చూసి... ' సారీ, ఇప్పుడు కాదు.. ఇంకోసారి' అని చెప్పగలగడం కూడా ఈజీ ఏం కాదు. ఇప్పుడు సరిగ్గా ఇలాంటిదే జరిగింది శ్రీలీల కెరీర్‌లో. అద్భుతమైన అవకాశం తలుపు తడితే, సారీ అంటూ సింపుల్‌గా చెప్పేశారట శ్రీలీల. గట్సీ గర్ల్ అంటూ తెగ మెచ్చుకుంటున్నారు జనాలు. చూశారుగా అదీ సంగతి.. అటు హీరో ఎవరైనా సరే, ఇటు పాట ఏం ఉన్నా సరే... బంగారంలాంటి స్టెప్పులేసి అందరి చేతా విజిల్ వేయించేస్తారనే పేరుంది శ్రీలీలకు. అందుకే ఆమెకు స్టోరీ నెరేట్ చేసేటప్పుడే పాటలు, వాటికున్న స్టెప్పులు గురించీ ముందే హింట్ ఇచ్చేస్తున్నారు మనవాళ్లు. రీసెంట్‌గా మహేష్‌తోనూ దుమ్మురేపే స్టెప్పులు వేయించేసి ప్రశంసలు అందుకున్నారు ఈ బ్యూటీ. ఇవన్నీ చూశాక తమిళ తంబిలు ఊరుకుంటారా? వెల్కమ్ ప్లీజ్ అని ఆహ్వానం పలుకుతున్నారు. విజయ్ హీరోగా నటిస్తున్న గోట్ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్‌కి స్టెప్పులు వేయమని శ్రీలలను అప్రోచ్ అయ్యారట మేకర్స్. కానీ అయామ్ సారీ అని చెప్పేశారట మిస్ లీల. తెలుగులో రిపీటెడ్ కాంబినేషన్స్ లో చాలా సినిమాలున్నాయి. కాల్షీటు సర్దడం కుదరదని చెప్పారని కోలీవుడ్ న్యూస్. అయితే, ఇన్‌సైడ్ సోర్స్ మాత్రం మరోలా ఉంది. తమిళ్‌లో ఫస్ట్ సినిమా ఛాన్స్ విజయ్‌తో అనగానే హ్యాపీగా అనిపించిందట శ్రీలీలకి. అంతో, ఇంతో కేరక్టర్ కూడా ఉంటే కచ్చితంగా ఒప్పుకునేవారట. జస్ట్ స్పెషల్ సాంగ్ అని మేకర్స్ తెగేసి చెప్పడంతో.. మరీ ఫస్ట్ సినిమాతో ఐటమ్ గర్ల్ అనే ముద్ర ఎందుకుని అనుకున్నారట. ఆ విషయాన్ని వాళ్లకి డైరక్ట్ గా చెప్పకుండా కాల్షీటు కుదరట్లేదని సున్నితంగా చెప్పారని సమాచారం




## ప్రేక్షకుల ముందుకు కల్కి స్పెషల్ బుజ్జి వెహికిల్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా వస్తున్న లేటెస్ట్ మూవీ కల్కి 2898 ఏడీదర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో దీపికా కడుకొనే హీరోయిన్ గా నటిస్తున్నారు. ఇండియన్ మైథలాజికల్ కాన్సెప్ట్ తో స్సై÷ జానర్ లో వస్తున్న ఈ సినిమాలో ఇండియన్ దిగ్గజ నటులు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కీ రోల్స్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా నుండి విడుదలైన పోస్టర్స్. టీజర్స్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేశాయి. ఇక ఇటీవల విడుదలైన బుజ్జి వీడియో అయితే నెక్ట్స్ లెవల్ అనే చెప్పాలి. ఈ సినిమా కోసం బుజ్జి పేరుతో ఒక ఫ్యూచరిస్టిక్ కారు డిజైన్ చేశారు మేకర్స్. ప్రస్తుతం ఈ కారు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. చాలా స్టైలీష్ గా ఉన్న ఈ కారు టాక్ అఫ్ ది ఇండియా గా మారింది. ప్రస్తుతం ఎక్కడ చూసిన ఈ కారు గురించే చర్చ నడుస్తోంది. అందుకే ఈ కారును ఆడియన్స్ వద్దకు తీసుకురావాలని ఎ÷-లాన్ చేస్తున్నారట. జూన్ 27న కల్కి విడుదల కానున్న విషయం తెలిసిందే. ప్రమోషన్స్ లో భాగంగా బుజ్జి కారును వాడనున్నారట మేకర్స్. ఇందులో భాగంగా.. భారతదేశంలోని కొన్ని నగరాలకు బుజ్జి ను తీసుకురానున్నారట. అంతేకాదు.. ఆడియన్స్ బుజ్జితో సెల్ఫీలు తీసుకునే అవకాశాన్ని కల్పించనున్నారట. ఆ సమయంలో బుజ్జితో కల్కి టీమ్ కూడా ఉంటారని సమాచారం. దీంతో.. ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

## మనసుకీ నోటికీ మధ్య ఫిల్టర్ ఉండదు



'ఇందులో నా పాత్ర పేరు రత్నమాల. విశ్వక్ పాత్ర పేరు రత్నాకర్. ఇద్దరినీ అందరూ రత్న అని పిలుస్తుంటారు. నా ఆహార్యం, మాట్లాడే తీరు అన్నీ కొత్తగా ఉంటాయి. మనసుకు, నోటికీ ఫిల్టర్ ఉండదు. ఏది అనిపిస్తే అది అనేస్తుంటాను.' అంటున్నది నటి అంజలి. విశ్వక్‌సేన్ కథానాయకుడిగా రూపొందిన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రంలో ఆమె ఓ కథానాయిక. కృష్ణచైతన్య దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా అంజలి ఆదివారం విలేకరులతో ప్రత్యేకంగా ముచ్చటించింది. 'దర్శకుడు కృష్ణచైతన్య ఈ కథ చెప్పినప్పుడు.. రత్నమాల పాత్రకు నన్నెందుకు అనుకున్నారు? అని అడిగాను. నాకు అద్భుతంగా నటించే నటి కావాలి. అందుకే మీ దగ్గరకు వచ్చాను అన్నారు. ఏ నమ్మకంతో చెప్పారో తెలీదుకానీ.. ఇంతమంచి పాత్ర చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. నేను ఈ సినిమా అంగీకరించడానికి కారణం ఈ పాత్రలోని వైవిధ్యమే.' అన్నారు అంజలి. ఇంకా చెబుతూ 'నా పాత్రలో వేరేషన్స్ ఎక్కువగా ఉంటాయి. అందుకే ఈ పాత్రలోకి వెళ్లడానికి ఎక్కువ సమయం పట్టింది. నిజంగా విశ్వక్, నేనూ పోటీపడి నటించాం.' అని తెలిపారు అంజలి. విశ్వక్‌సేన్‌తో నటించడం చాలా ఆనందంగా ఉందని, తను మంచి స్నేహితుడని, అందుకే అతనితో తేలిగ్గా నటించగలిగానని చెప్పారు అంజలి.


## మరోసారి బ్రేకప్ పై శృతి హాసన్ స్ట్రాంగ్ స్టేట్మెంట్..

ద

సింగిల్ పసంగ.. అనే పాట ఆ మధ్య తమిళ్‌లో చాలా చాలా పాపులర్ అయింది. ఇప్పుడు దీని ఫీమేల్ వెర్షన్‌ని ట్రై చేస్తున్నారు శ్రుతి హాసన్. బేసిగ్గా మ్యూజిక్ డైరక్టర్ కాబట్టి, ఆ మాత్రం క్రియేటివిటీని చూపించడంలో తప్పేం లేదులే అనుకునేరు.. ఇక్కడ మాట్లాడుకుంటున్నది జస్ట్ ప్రొఫెషనల్ విషయం కాదు... అంతకు మించిన పర్సనల్ ఇష్యూ.. సింగిల్.. మింగిల్.. స్టేటస్‌ల గురించి చూసేద్దాం.. శ్రుతిహాసన్ ఇప్పుడు సింగిల్‌గా ఉన్నారా? నిజంగానే శాంతనుతో బ్రేకప్ అయిందా? లేకుంటే ఇద్దరూ మనస్పర్థలతో దూరంగా ఉంటున్నారా?.. ఇక ఇలాంటి ప్రశ్నలకు అసలు ఆస్కారమే లేదు.. మీకెందుకు అన్ని అనుమానాలు అంటూ ఉన్న విషయాన్ని ఓపెన్‌గా చెప్పేశారు మేడమ్ శ్రుతి. ప్రస్తుతం తాను సింగిల్‌గానే ఉన్నానని స్టేట్‌మెంట్ ఇచ్చేశారు శ్రుతిహాసన్. బోయ్‌ఫ్రెండ్ శాంతను హజారికాతో ఇటీవల ఆమె విడిపోయారు. ఈ విషయాన్నే లేటెస్ట్ గా స్పష్టం చేశారు శ్రుతి. వర్క్ నీ, లైఫ్‌నీ బ్యాలన్స్ చేస్తూ ఎంజాయ్ చేస్తున్నట్టు ప్రకటించారు మింగిల్ కావడానికి తానెప్పుడూ రెడీగానే ఉన్నానని చెప్పారు. కాకపోతే.. షరతులు వర్తిస్తాయి అని చెబుతున్నారు ఈ బ్యూటీ. ఇప్పటికి శ్రుతిహాసన్ ఫుల్ ఫోకస్ పూర్తిగా కెరీర్ మీదే ఉందట. సినిమాలతో, సంగీతంతో మింగిల్ కావడానికే ప్రస్తుతం తన మనసు ఇష్టపడుతోందట. 2023లాంటి సక్సెస్‌ఫుల్ ఇయర్‌ని రీక్రియేట్ చేయడానికి కృషి చేస్తున్నానని అంటున్నారు మిస్ హాసన్. బ్యాక్ టు బ్యాక్ రిలీజ్ అయిన ప్రతి సినిమా సక్సెస్ టాక్‌తో దూసుకుపోతుంటే వచ్చే పాజిటివ్ వైబ్‌ని ఎవరైనా.. కెరీర్‌లో ఒక్కసారైనా



## డిఫరెంట్‌గా పవన్ ఓజి చిత్రం




పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న సినిమాల్లో 'ఒ.జి' ఒకటి. సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. డి.వి.వి.దానయ్య నిర్మాత. చిత్రీకరణ దాదాపు చివరి దశకు చేరుకుంది. ఈ సినిమా గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాల్ని పంచుకున్నారు దర్శకుడు సుజీత్. 'భజే వాయు వేగం' ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆ చిత్ర కథానాయకుడు కార్తికేయ, దర్శకుడు సుజీత్ కలిసి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఒ.జి' సినిమా ప్రస్తావన రాగా, ఆ సంగతుల్ని పంచుకున్నారు సుజీత్. 'పవన్‌కల్యాణ్ సినిమాల్లో జపనీస్ సినిమాల ప్రభావం చాలా ఉంటుంది. పాటల్లోనూ, ఇతర సన్నివేశాల్లోనూ అది కనిపిస్తూ ఉంటుంది. అవకాశం వస్తే పవన్‌కల్యాణ్‌ని ఆ నేపథ్యంలో చూపించాలనుకున్నా. 'ఒ.జి'తో అది నెరవేరింది. ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ అనే మాట నుంచే 'ఒ.జి' అనే పేరు పుట్టింది. అయితే సినిమాలో పవన్‌కల్యాణ్ పాత్ర పేరు ఓజాస్ గంభీర. గంభీర ఆయన పేరు, ఓజాస్ అనేది మాస్టర్ పేరు' అని చెప్పుకొచ్చారు సుజీత్. మొదట తనను రీమేక్ సినిమా కోసం పిలిచినట్టు చెప్పారు సుజీత్. 'పవన్‌కల్యాణ్‌తో ఒరిజినల్ కథ చేయడంలో ఉన్న అనుభూతి, కిక్ వేరు. అదృష్టవశాత్తూ ఒక రోజు 'కొత్త కథ ఏదైనా ఉందా?' అని అడిగారు పవన్‌కల్యాణ్. ఇన్ని రోజులు ఎదురు చూసినందుకు ప్రకృతి అలా సహకరించింది. ఒక్క లైన్ చెప్పగానే ఆయన చేయడానికి అంగీకారం తెలిపార'న్నారు సుజీత్. 'ఒ.జి'లో పవన్‌కల్యాణ్ సరసన ప్రియాంక మోహన్ నటిస్తున్నారు.ం

Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com